చురుగ్గా ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారుల వెరిఫికేషన్



వెరిఫికేషన్‌లో పాల్గొన్న కమిషన్ శరత్‌చంద్ర

బండ్లగూడ: ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాల తనిఖీ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి నివేదిక ఉన్నతాధికారులకు సమర్పిస్తున్నామని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని 9వ డివిజన్ కిస్మత్‌పూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారుల జాబితా వెరిఫికేషన్‌ను చేపట్టారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం వేరిఫై చేసి అర్హుల జాబితాలను అధికారులకు నివేదిస్తామన్నారు. వార్డు ఆఫీసర్ ఎం.యాదమ్మ, బిల్ కలెక్టర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

శంషాబాద్: ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన మెటా మైండ్ అకాడమీ విద్యార్థులను కళాశాల యజమాన్యం, అధ్యాపక బృందం గురువారం జరిగిన కార్యక్రమంలో అభినందించింది. ఎంపీసీ ప్రథమ సంవత్సరంలో మహరాజ్, శ్రావ్యశ్రీ అనే ఇద్దరు విద్యార్థులు 468 మార్కులతో రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు సాధించారు. బైపీసీలో పూజిత 435, హరిణి 433 మార్కులతో రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారు. రెండు గ్రూపుల్లో కలిసి మొత్తం 240 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 99.5 శాతం ఉత్తీర్ణ సాధించినట్లు నిర్వాహకులు వెల్లడించారు.

ముగిసిన నామినేషన్ల ప్రక్రియ

మణికొండ: అలకాపూర్ టౌన్‌షిప్ రెసిడెన్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా గురువారం రాత్రి 8 గంటలకు నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని అతిపెద్ద టౌన్‌షిప్ అయిన అలకాపూర్‌కు రెండు సంవత్సరాలకు ఒక సారి కార్యవర్గాన్ని ఎన్నుకుంటారు. మొదటగా 21 మంది సభ్యులను ఎన్నుకుని తరువాత మిగతా కార్యవర్గాన్ని వారు ఎన్నుకుంటారు. అయితే ఈ సారి అదనంగా ఒక నామినేషన్ ఎక్కువగా రావటంతో ఆ సంఖ్య 22కు చేరింది. శుక్రవారం నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని, అందులో ఒకరు ఉపసంహరించుకుంటే ఎన్నికలు జరిగే అవకాశం ఉండదని, లేదంటే శనివారం ఎన్నికలు నిర్వహిస్తామని ఎన్నికల అధికారి, ఆల్ కాలనీస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వి. ఆంజనేయులు తెలిపారు. ఎన్నికల అధికారులు రాజశేఖర్, కాంతారావులతో పాటు కాలనీ వాసులు పాల్గొన్నారు.

మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

శంషాబాద్ రూరల్: మండల పరిధిలోని ముచింతల్ శివారులో ఉన్న స్వర్ణ భారత్ ట్రస్టు ఆధ్వర్యంలో మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ సహకారంతో శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 25 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని, 30 రోజుల శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణతో పాటు ఉచిత భోజన, వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, 3 ఫొటోలను తీసుకుని రావాలన్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వాసులకు అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

అత్తాపూర్‌లో పాక్ దిష్టిబొమ్మ దహనం



అత్తాపూర్‌లో ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు

అత్తాపూర్: జమ్మూకశ్మీర్‌లో టెర్రరిస్టులు చేసిన మారణకాండకు నిరసనగా అత్తాపూర్ డివిజన్‌లో నిరసన ర్యాలీ చేపట్టడంతో పాటు పాకిస్థాన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. బీజేపీ డివిజన్ అధ్యక్షుడు సులిగే వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజుభూపాల్‌గౌడ్ పాల్గొన్నారు. నేతలు వై.శ్రీధర్, మల్లారెడ్డి, కొమురయ్య, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించుకుందాం

- భూ భారతిలో అధికార వికేంద్రీకరణ
- యాజమాన్య హక్కులను సరిచేస్తాం
- ఎక్కడి సమస్యలు అక్కడే పరిష్కరిస్తాం
- రెండు చోట్ల అప్పీల్‌కు అవకాశం
- వ్యవసాయేతర భూములకు పక్కా రికార్డు
- మండలానికో సర్వేయర్
- సర్వే తరువాతనే రిజిస్ట్రేషన్‌లు
- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

మణికొండ: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టం ద్వారా జిల్లాలో భూ రికార్డుల సమస్యలను కలసికట్టుగా పరిష్కరించుకుందామని, అందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం గండిపేట మండలం, ఖానాపూర్‌లోని రైతువేదికలో భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... భూ భారతి చట్టం ద్వార రెవెన్యూ అధికారుల అధికారాలను వికేంద్రీకరణ చేశారన్నారు. దాంతో ఎక్కడి సమస్యలు అక్కడే పరిష్కారానికి నోచుకుంటాయన్నారు. గతంలో అప్పిలేట్ అవకాశం లేకపోవటంతో ప్రతి సమస్యకు భూ యజమానులు కోర్టులను ఆశ్రయించాల్సి వచ్చిందన్నారు. భూములు క్రయ, విక్రయాలు, యాజమాన్య బదాలాయింపులు చేసేందుకంటే ముందే దాన్ని సర్వే చేసి హద్దులు నిర్ణయించి దాని మ్యాప్ ఆధారంగా రిజిస్ట్రేషన్‌లు జరుగుతాయన్నారు. పాస్‌బుక్‌లపై వారి భూమి విస్తీర్ణం, యజమాని, హద్దుల వివరాల మ్యాప్ ఉంటుందన్నారు. అనేక రాష్ట్రాల రెవెన్యూ వ్యవస్థలను పరిశీలించిన సులభతరంగా ఉండేలా భూ భారతి చట్టాన్ని ప్రభుత్వం తెచ్చిందన్నారు.

గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులు

గ్రామాలలో ఉన్న రెవెన్యూ సమస్యలను తొలగించేందుకు మే నెల 1వ తేదీ నుంచి గ్రామాల వారిగా రెవెన్యూ సదస్సులను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. భూముల వివాదాలను అక్కడికక్కడే పరిశీలించి కోర్టు కేసుల్లో లేనివి అపుడే పరిష్కారం చేపుతారని జిల్లా కలెక్టర్ అన్నారు. రాబోయే రోజుల్లోను ఎలాంటి భూ సమస్యలు రాకుండా వ్యవసాయ భూములతో పాటు వ్యవసాయేతర భూముల వివరాలను సరిచే సేలా చట్టంలో ఉందన్నారు. ప్రతి మనిషికి ఆధార్ కార్డు ఉన్నట్టుగా భూమిని భూధార్ కార్డులను అందజేస్తామన్నారు. భూముల యాజమాన్యాలపై ఎలాంటి తప్పులు జరిగినా ఆర్డీఓ, జిల్లా కలెక్టర్ స్థాయిలో అప్పీల్ చేసి సరిదిద్దుకునే అవకాశం ఉందన్నారు.



సదస్సులో పాల్గొన్న రైతులు

సామరస్యంగా పరిష్కరించుకోవాలి...

గ్రామాలలో భూముల రికార్డుల వివాదాలను సామరస్యంగా మాట్లాడుకోవటంతో పాటు అధికారుల వద్దకు వెలితే వాటిని పరిష్కరిస్తారని, రాబోయే రోజుల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. గత ప్రభుత్వంలో పేరుకుపోయిన భూ సమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని రాష్ట్రాలలో వ్యవస్థలను పరిశీలించి భూ భారతి చట్టాన్ని తెచ్చారన్నారు. రైతులకు, ప్రజలకు మేలు చేసే ప్రభుత్వమని వాటితో లబ్ధి పొందాలన్నారు.

- రాజేంద్రనగర్ ఆర్డీఓ వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ టి.మల్లేష్ ముదిరాజ్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ కె.వేణుగౌడ్, నార్సింగి, హైదర్‌షాకోట్ పీఏసీఎస్‌ల చైర్మన్‌లు టి.కృష్ణ, ప్రేందాస్, మాజీ సర్పంచ్‌లు ఆర్.నర్సింహా, గండయ్య, మాజీ కౌన్సిలర్ అమరేందర్‌రెడ్డి, వ్యవసాయశాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

గుర్రపు డెక్క తొలగింపు షురూ



గుర్రపు డెక్క తొలగింపు పనులను పరిశీలిస్తున్న అధికారులు

అత్తాపూర్: దోమల వృద్ధికి ఉపకరిస్తున్న గుర్రపు డెక్క తొలగింపు పనులు ప్రారంభమయ్యాయి. అత్తాపూర్ డివిజన్ నుంచి మొదలుకొని మలక్‌పేట్ వరకు మూసీ నదికి ఉత్తర, దక్షిణ దిక్కులలో ఇటాచీలతో గుర్రపు డెక్కను తొలగించే కార్యక్రమం మొదలైంది. దీనికి తోడు దోమల గుడ్ల ఉత్పత్తిని నివారించడానికి డ్రోన్ల సాయంతో యాంటీ లార్వా ఆపరేషన్‌ను సైతం ప్రారంభించారు. అత్తాపూర్ డివిజన్ పరిధిలో ప్రారంభమైన గుర్రపు డెక్క తొలగింపు పనులను ఎంటమాలజీ విభాగం అధికారి నామాల శ్రీనివాస్‌తో పాటు సహాయ అధికారులు లక్ష్మీనారాయణ, ఉదయ్ పర్యవేక్షిస్తున్నారు. గుర్రపు డెక్క తొలగింపు ఆపరేషన్ మూడు నెలల పాటు నిరంతరంగా కొనసాగుతుందని చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్న వెల్లడించారు. పౌర సంఘాల అభ్యర్థులను మన్నించి యుద్ధ ప్రాతిపదికన గుర్రపు డెక్క తొలగింపు కార్యక్రమం చేపట్టినందుకు లక్ష్మీరామ్ హరన్ అసోసియేషన్ ప్రతినిధులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

రాజ్యాంగాన్ని సంరక్షించుకోవాలి

ఏఐసీసీ పరిశీలకుడు సంపత్‌కుమార్, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే

మణికొండ: ఎన్నో త్యాగాలతో వచ్చిన దేశ స్వాతంత్రం, రాజ్యాంగం అమలును ప్రతి ఒక్కరు భావి తరాలకు అందించేందుకు పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతో ఉందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్, ఏఐసీసీ పరిశీలకుడు, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ అన్నారు. గురువారం కాంగ్రెస్ పార్టీ నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు కె.అశోక్‌యాదవ్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ కేంద్రంలో నిర్వహించిన జై బాపు, జైభీం, జై సంవిదాన్ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. నార్సింగి ఆవు బొమ్మ సర్కిల్ నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దేశంలో బీజేపీ తమ రాక్షస పాలనతో రాజ్యాంగాన్ని పక్కన పెట్టి ఇష్టారాజ్యంగా నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. దాన్ని అలాగే వదిలేస్తే రాబోయే రోజుల్లో రాజ్యాంగం అమలుకు నోచుకోని పరిస్థితి వస్తుందన్నారు. అందుకే కాంగ్రెస్ పార్టీ దేశ వ్యాప్తంగా రాజ్యాంగాన్ని పరిరక్షించాలనే ఉద్దేశంతో ప్రతి గ్రామంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు రాజ్యాంగంపై అవగాహన కల్పించటంతో పాటు దాన్ని అమలుకు, పరిరక్షణకు ముందుకు రావాలని కోరుతున్నామన్నారు. గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ టి.మల్లేష్‌ముదిరాజ్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ కె.వేణుగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ టి.కృష్ణ, నార్సింగి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ వెంకటేష్‌యాదవ్, నాయకులు డి.కిరణ్, పాపిరెడ్డి, ప్రవీణ్‌యాదవ్, పొన్న రమేష్, వినోద్‌కుమార్, అశోక్, గండయ్య, డి.లక్ష్మణ్, మాజీ కౌన్సిలర్‌లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉగ్రవాదులను అంతం చేయాలి



కొవ్వొత్తులతో ర్యాలీలో పాల్గొన్న పంచవటి కాలనీ వాసులు

మణికొండ: అభం, శుభం తెలియని పర్యాటకులపై విచక్షణారహితంగా కాల్పులు జరిపి 27 మంది మృతికి కారకులైన పాకిస్థాన్ ఉగ్రవాదులను అంతం చేయాలని మణికొండ మున్సిపాలిటీ, పంచవటి కాలనీ ప్రజలు, నార్సింగి మున్సిపాలిటీ కేంద్రం ప్రజలు డిమాండ్ చేశారు. గురువారం రాత్రి కాలనీలో ప్రజలు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి మృతుల ఆత్మలు శాంతించాలని నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కాలనీల వాసులు మాట్లాడుతూ... కశ్మీర్‌లో ఉన్న ఆర్టికల్ 370ని తొలగించి సుందర పర్యాటక ప్రాంతంగా కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్నదన్నారు. దాంతో కాశ్మీరీ ప్రజల జీవన ప్రమాణాలు మారి రాష్ట్ర ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందన్నారు. దాన్ని జీర్ణించుకోలేని ఉగ్రమూకలు ఇలాంటి సంఘటనలకు పాల్పడి పర్యాటకులను రాకుండా చేసి వారి రాష్ట్ర ప్రజల అభివృద్ధినే అడ్డుకుంటున్నారన్నారు. మతాలు కూడు పెట్టవని, సర్వ మతాలు కలిసి జీవిస్తున్న దేశంలో ఒకటి, రెండు రాష్ట్రాలలోనే ఇలాంటి సంఘటనలు ఎందుకు జరుగుతున్నాయో దేశ ప్రజలు ఆలోచన చేయాలన్నారు. దౌత్య పరంగా కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు బాగున్నాయని, ఉగ్రవాదులను అంతం చేసినపుడే మృతులకు నిజమైన నివాళి అన్నారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డి.సీతారాం, నార్సింగి మాజీ కౌన్సిలర్ ఉషారాణి, నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



నార్సింగిలో ర్యాలీలో పాల్గొన్న ప్రజలు

వాహనాల బ్యాటరీలు చోరీ

శంషాబాద్ రూరల్: పార్కు చేసిన వాహనాల బ్యాటరీలను చోరీ చేసిన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. మల్కారం, కవేలిగూడ చౌరస్తాతో పాటు షాబాద్ రహదారి వెంబడి ఉన్న మరో రెండు గ్రామాల వద్ద పార్కు చేసిన లారీలు, ఆటో ట్రాలీల బ్యాటరీలను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. దీంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రెడీమిక్స్ వాహనం బోల్తా

నార్సింగిలో ట్రాఫిక్ జాం



మణికొండ: వేగంగా వచ్చిన ఓ రెడీమిక్స్ వాహనం నార్సింగి రక్తమైసమ్మ ఆలయ మలుపులో అదుపు తప్పి గురువారం పల్టీ కొట్టింది. దాంతో పోలీస్‌స్టేషన్ ఎదుట దాదాపు రెండు గంటల పాటు వాహనాల రాకపోకలు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వాహనంలో డ్రైవర్ మాత్రమే ఉండటంతో అతని స్వల్పగాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. గంట తరువాత ట్రాఫిక్ పోలీసులు వాహనాన్ని రోడ్డుపై నుంచి తొలగించి వాహనాలు రాకపోకలను పునరుద్ధరించారు. భారీ వాహనాలకు అనుమతి లేని సమయంలో అవి తిరుగుతున్నా పోలీసులు పట్టించుకోవటం లేదని, అవి వేగంగా ప్రయాణించి ప్రమాదాలకు కారణం అవుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

అత్తాపూర్‌లో మౌన ప్రదర్శన

అత్తాపూర్: అత్తాపూర్ అంబియన్స్‌ఫోర్ట్ కాలనీ వాసులు ఉగ్రదాడికి వ్యతిరేకంగా గురువారం రాత్రి మౌన ప్రదర్శన, కొవ్వత్తుల ర్యాలీలు నిర్వహించారు. కాలనీ వాసులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. ఇలాంటి చర్యలు పిరికిపంద చర్యలుగా అభివర్ణించారు. నిందితులను కఠినంగా శిక్షించినప్పుడే దాడిలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరుతుందన్నారు. మ్యాడం మధుసూదన్, కాలనీ వాసులు పాల్గొన్నారు.



అత్తాపూర్‌లో మౌన ప్రదర్శనలో ప్రజలు

ఎఫ్ఐఈటీతో ఎంజీఐటీ ఒప్పందం



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న ప్రతినిధులు

మణికొండ: విద్యార్థులకు నాన్ డిస్ట్రక్టివ్ టెస్టింగ్‌లో మెలకువలు నేర్చుకునేందుకు ఫ్రొంటియర్ ఇన్స్టిట్యూషన్ ఇంజినీరింగ్ టెక్నాలజీ (ఎఫ్ఐఈటీ)తో గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ) కళాశాల ఒప్పందం కుదుర్చుకుందని ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. గండిపేటలోని ఎంజీఐటీ కళాశాలలో ఇరు సంస్థల ప్రతినిధులు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. కార్యక్రమంలో ఎఫ్ఐఈటీ ఎండీ కిరణ్‌రాజ్, ఎంజీఐటీ వైస్ ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి, హెచ్ఓడీ డాక్టర్ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఐఆర్‌డీపీఆర్‌లో బిహార్ ప్రజాప్రతినిధులకు శిక్షణ



శిక్షణలో పాల్గొన్న బిహార్ ప్రతినిధులు

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని జాతీయ గ్రామీణాభివృద్ధి పంచాయతీ రాజ్ సంస్థ (ఎన్ఐఆర్‌డీపీఆర్)లో బిహార్‌లోని గ్రామ పంచాయతీ అధ్యక్షులకు 3 రోజుల శిక్షణను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్ఐఆర్‌డీపీఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ నరేంద్రకుమార్ మాట్లాడుతూ... జాతీయ అభివృద్ధి లక్ష్యాలను అభివృద్ధి చేయడంలో పంచాయతీరాజ్ పాత్ర కీలకంగా ఉంటుందన్నారు. తెలంగాణలో అవార్డులు గెలుచుకున్న పంచాయతీలను వారికి వివరించారు. ఆయా పంచాయతీలకు వారికి చూపించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ఎన్ఐఆర్‌డీపీఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

తిరుమలహిల్స్ సమస్యలు పరిష్కరించండి

బీఆర్ఎస్ మణికొండ అధ్యక్షుడు సీతారాం



సమస్యలు తెలుసుకుంటున్న బీఆర్ఎస్ నేతలు

మణికొండ: తిరుమలహిల్స్ కాలనీలో రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, వరద నీరు రోడ్లపై నిలవటం, విద్యుత్ వైర్లు వేలాడటం, కాలీ స్థలాల్లో చెత్త వేయటం, రోడ్లను అభివృద్ధి చేయకపోవటం, వీధి కుక్కల బెడద, సకాలంలో నీటి ట్యాంకర్లు రాకపోవటం లాంటి సమస్యలు ఉన్నాయని వాటిని వెంటనే పరిష్కరించాలని బీఆర్ఎస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు డి.సీతారాం డిమాండ్ చేశారు. గురువారం పార్టీ నాయకులతో కలిసి గుడ్ మార్నింగ్ మణికొండ కార్యక్రమంలో బాగంగా తిరుమలహిల్స్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మున్సిపాలిటీ పరిధిలో వీధి కుక్కలకు షెల్టర్ హోం నిర్మించాలని గతంలో పాలక కమిటీ తీర్మానం చేసినా అమలు చేయటంలో అధికారులు విఫలమయ్యారన్నారు. తిరుమల హిల్స్ నుంచి సెక్రటేరియట్ కాలనీని కలుపుతూ ఉన్న రోడ్డు నెంబర్ 2ను అభివృద్ధి చేయకపోతే కబ్జాలకు గురవుతుందన్నారు. వీధి దీపాలు నాసిరకంవి ఏర్పాటు చేస్తుండటంతో తొందరగా పాడవుతున్నాయన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి జి.నరేందర్, ఎ.లక్ష్మణ్‌రావు, బి.బాబు, ఉపేంద్రనాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌చారి, శ్రీకాంత్, కిరణ్, సుమనళిని, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

బ్లాక్‌మెయిల్ చేస్తున్న యూట్యూబర్‌పై జుక్కల్ ఎమ్మెల్యే ఫిర్యాదు

రాజేంద్రనగర్: తనను బ్లాక్ మెయిల్ చేస్తూ డబ్బులు డిమాండ్ చేస్తున్న యూట్యూబ్ రిపోర్టర్‌తో పాటు మహిళపై జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత రావు రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని యూట్యూబర్ శ్యామ్‌సుందర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఒక సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్, కారును స్వాధీనం చేసుకున్నారు. గురువారం ఉప్పర్‌పల్లి న్యాయమూర్తి ముందు హాజరు పరిచారు. జడ్జి ఆదేశాల మేరకు యూట్యూబర్ శ్యామహసుందర్‌కు 141 కింద నోటీసులు అందించి పంపించారు.

డబ్బులు డిమాండ్ చేయలేదు...

తన వద్దకు నీరూప అనిల్ కుమార్ గాగానియా అనే మహిళ వచ్చి తన సమస్యను వివరించిందని... తాను తన సెల్‌ఫోన్ ద్వారా ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావుతో ఫోన్ చేసి మాట్లాడి మహిళకు న్యాయం చేయాలని కోరినట్లు యూట్యూబర్ తెలిపాడు. తాను ఎక్కడా డబ్బులు డిమాండ్ చేయలేదన్నారు. ప్రజాప్రతినిధిగా ఉండి ఇలాంటి చర్యలు మంచిది కాదని తెలిపానే తప్పా.. డబ్బులు అడగలేదన్నారు. నీరూప అనిల్ కుమార్ గాగానియా మాట్లాడుతూ... 2012లో ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు కోటి రూపాయలు తన వద్ద తీసుకున్నాడని... అప్పటి నుంచి డబ్బుల విషయమై అడిగితే ఇవ్వడం లేదని... ఇదే విషయమై యూట్యూబర్ శ్యాంసుందర్‌ను కలిసి తెలిపినట్లు వెల్లడించారు. డబ్బు విషయమై పోలీస్‌స్టేషన్‌లో సైతం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

వీడియోలో కాయిన్ చూపించి.. రూ. లక్షలు కాజేసిన కి'లేడీ'

- తయారు చేసి విక్రయిస్తే కోట్లు వస్తాయని నమ్మించింది
- మహిళ నుంచి పలు దఫాలుగా రూ. 8 లక్షలు కాజేసిన లేడీ
- ఆర్‌జీఐఏ పోలీసులను ఆశ్రయించిన బాధిత మహిళ

శంషాబాద్: ''అదో స్పెషల్ కాయిన్... కాయిన్ ఎదురుగా పెట్టగానే సూది కూడా లేచి నిలబడుతుంది''.. ఇలా కాయిన్‌తో అనేక విన్యాసాలు చూపించి దానిని తయారీకి రూ. 4 నుంచి రూ. 6 లక్షలు ఖర్చు చేస్తే.. దానిని కోటి రూపాయలు పెట్టి కొనుగోలు చేస్తారు.. లేడీ టక్కుటమార విద్యలతో పాటు మాటలను నమ్మిన ఓ మహిళ 8 లక్షల రూపాయలు చెల్లించింది.. ఆరు నెలలుగా ఇదిగో అదిగో అంటూ చెప్పుకొస్తున్న ఆ మహిళ మాటలు నమ్మి చివరికి నిండా మునిగింది.

జరిగింది ఇలా...

శంషాబాద్ పట్టణంలోని సాతంరాయి బస్తీకి చెందిన అరుణ(32) అదే బస్తీకి చెందిన ఓ యువకుడి ద్వారా కాయిన్ విషయాన్ని తెలుసుకుంది. కర్నాటక మైసూర్ ప్రాంతానికి చెందిన లక్ష్మీ అనే మహిళ ఈ కాయిన్ వ్యాపారం చేస్తుందని తెలపడంతో గతేడాది అక్టోబర్‌లో అరుణ నగరంలోని తాజ్ కృష్ణ హోటల్ ముందు ఉన్న కాఫీ షాపులో కిలేడీ లక్ష్మిని కలిసింది. లక్ష్మీ మరోమారు వీడియోలో కాయిన్ చూపించి దానిని తయారు చేయడానికి సుమారు రూ. 6 లక్షల వరకు ఖర్చువుతుందని తయారు చేసి దానిని అమ్మి కోటి రూపాయాల వరకు ఇస్తానని నమ్మించింది. ఆమె మాటలను నమ్మిన అరుణ నగదు రూపంలో రూ. 90 వేలు ఇవ్వగా పలు దఫాలుగా రూ. 6 లక్షలు చెల్లించింది.

తనిఖీలంలూ...

కాయిన్ చేసిన తర్వాత తాను ఉంటున్న హోటల్‌లో తనిఖీలు జరగడంతో దానిని అక్కడే పడేసి వెళ్లాలని బుకాయించింది. తనకు మరో రెండు లక్షల వరకు చెల్లిస్తే ఈ దఫా కాయి తప్పకుండా చేసి విక్రయించి నీ కష్టం అంతా తీర్చేస్తానని నమ్మించింది. దీంతో మరోసారి మోసపోయిన మరో రెండు లక్షల వరకు ఫోన్‌పే ద్వారా చెల్లించింది.

ఎయిర్‌పోర్టులో హైడ్రామా...

తాను పూర్తిగా మోసపోయినట్లు గుర్తించిన అరుణ ఎలాగైనా లక్ష్మిని పట్టుకుని పోలీసులకు అప్పగించాలని ఈ నెల 19 మరో వ్యక్తి డబ్బులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నాడని శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు రప్పించింది. ఆ రోజు మాట్లాడిన తర్వాత మరుసటిరోజు ఉదయం శనివారం కలుస్తానని చెప్పి నిందితురాలు అక్కడి నుంచి వెళ్లిపోయింది. దీంతో ఈ నెల 20 ఉదయం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చిన కిలేడీని పట్టుకునేందుకు నానా పాట్లు పడ్డారు. చివరికి పోలీసుల సాయంతో పట్టుబడింది.. తాను డబ్బులు తిరిగి చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నానని పోలీసుల సమక్షంలోనే నమ్మించింది. ఆ తర్వాత తనతో పాటు కారు ఎక్కాలని చెప్పిన లేడీ చాకచక్యంగా అరుణతో పాటు ఆమెతోపాటు ఉన్న మరో మహిళను తోసేసి తనవెంట వచ్చిన వ్యక్తితో కారుతో వేగంగా ఎయిర్‌పోర్టు నుంచి ఉడాయించింది. దీంతో బాధిత మహిళ బుధవారం సైబరాబాద్ పోలీస్ కమిషనర్ కార్యాలయానికి వెళ్లి తన గోడు వెళ్లబోసుకుంది. అక్కడి పోలీసుల సూచనల మేరకు గురువారం ఆర్‌జీఐఏ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బాలరాజు ముందు జరిగిన విషయాన్ని వెల్లడిండించడంతో పాటు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసింది. కిలేడీ ఫొటోలు, ఫోన్‌పే ద్వారా చెల్లింపు చేసిన వాటన్నింటిని, పలు దఫాలుగా జరిగిన సంభాషణల రికార్డింగులు సమర్పించింది. బాధితురాలి నుంచి ఈ మేరకు పోలీసులు ఫిర్యాదును తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9989616273
9010221230